# అతని కంటే ఘనుడు

సి. జయపాల్ రెడ్డి


**తెలివైన వాళ్లలో మా సదానందం ఒకడనేది నా గట్టినమ్మకం. కొన్నాళ్ల క్రితం వరకూ నాపై నాకు అపారమైన నమ్మకం ఉండేది. సమయ స్ఫూర్తిలోనూ, కామన్‌సెన్స్‌లోనూ... ఇంకా ఇలాంటివేవో లక్షణాలు నాలో పుష్కలంగా ఉన్నాయని అనుకునేవాడిని. అయితే ఇవేవీ నాకు లేవనీ... నేనుత్త ''వేస్ట్ ఫెలో''నని మా సదానందం నిరూపించేశాడు.**

అదిగో నేనప్పటి నుంచి సదానందం లాంటి చురుకైన వాళ్లను పరిశీలించడం హాబీగా పెట్టుకున్నాను. వీళ్లు ఎలాంటి పరిణామాలు ఎదురైనా బెంబేలు పడకుండా వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటారనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు.

అయితే సదానందం మా గూటి పక్షి కనుకనూ, నాకు మిత్రుడు కనుకనూ నేను మీతో సదానందం గురించి ప్రస్తావించవలసి వచ్చింది. విషయంలోకి వస్తాను. సదానందాన్ని నేను ఇంతగా ప్రశంసించడానికి కల కారణాలను వివరిస్తాను.

నేను గత కొన్ని సంవత్సరాలుగా... అంటే టీవీ ఛానళ్లు మరీ ముఖ్యంగా తెలుగు టీవీ ఛానళ్లు ఇంతగా విజృంభించక ముందు సాహిత్య సేవ చేస్తూండేవాడిని. అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించేవాళ్లం. మన సాహిత్యం, సాంస్కృతిక వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలనే కోరిక వల్లనైతేనేమి, వాటిపట్ల నాకున్న మక్కువ అయితేనేమి... మా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ''సాహితీ వారధి'' ద్వారా తరచుగా కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం. మా సంస్థకు కార్యవర్గం ఉంది. కార్యవర్గ సభ్యులు కూడా ఉన్నారు. అయితే వాళ్లంతా పేరుకు మాత్రమే. అన్ని కార్యక్రమాలు నా నిర్ణయానుసారం జరగాల్సిందే. మా సభ్యులు ఏవో చిన్న చిన్న పనులు చేసేవారు. ఆహ్వాన పత్రాలు పంచడం, అతిధులకు స్వాగతం పలకడం, షీల్డులు, దండలు, శాలువాలు అందించడం... ఇలాంటివన్నమాట...

మీకిక్కడో నిజం చెప్పాలి. నేను మొదట్లో ఈ కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేయాలనుకున్నాను. కానీ నేను చేపట్టే కార్యక్రమాలను వేరే అంశాలు డామినేట్ చెయ్యడం మొదలుపెట్టాయి. సాహితీ సేవ ముసుగులో నన్ను నేను ప్రమోట్ చేసుకోవడం మొదలుపెట్టాను. నేను సాహితీ కార్యక్రమాలు చేపట్టిన రెండు



మూడేళ్లలోనే మా జిల్లాలో అందరికీ తెలిసిన వాడినయ్యాను. మా ఊరు వివిపిలందరూ నాతో సత్సంబంధాలు పెట్టుకోవడానికి ప్రయత్నించేవారు. దీనికి కారణం నేను ఏర్పాటు చేసే కార్యక్రమాలకు జనంలో విశిష్టమైన స్పందన రావడమే కాకుండా వాటి వివరాలన్నీ ఫోటోలతో సహా పత్రికల్లో రావడమే. ఈ కారణం చేతనే నేను నిర్వహించే కార్యక్రమాలకు అతిథులుగా, వక్తలుగా రావడానికి ఉవ్విళ్లూరేవారు.

గత ఇరవై ఏళ్లలో బదిలీ అంటే ఏమిటో తెలియకుండా ఇక్కడే ఉద్యోగం చేస్తున్నానంటే దానికి కారణం నా సాహితీ సేవే. చాలా కార్యక్రమాలకు మా బాస్‌ను అతిథిగానో, సభాధ్యక్షుడిగానో, ప్రత్యేక ఆహ్వానితుడిగానో, వక్తగానో పిలిచేవాడిని. బాస్‌లు ఎందరూ మారినా నేను ఆహ్వానించినప్పుడు ఎవరూ 'నో' అనలేదు. ఆ విధంగా ఠంచనుగా ఆఫీసుకెళ్లి పని చేయడమనే బాధ తప్పింది.

చిన్న చిన్న పైరవీలు చేయడమే కాకుండా సేకరించిన విరాళాల్లో కొంత నొక్కేయడం ద్వారా నా ఆర్థికస్థితి కూడా బాగా మెరుగైంది. ఇతర జిల్లాల్లోని సాహితీ సాంస్కృతిక సంస్థలకు కూడా నాపేరు ప్రఖ్యాతులు తెలిసిపోయాయి. వారు చేపట్టే కార్యక్రమాలకు నాకు ఆహ్వానాలు పంపడమే ఇందుకు నిదర్శనం.

పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఏ అందలాలు ఎక్కేవాడినో తెలియదు. కానీ రోజులు ఒక్కలా ఉండవు కదా. మా కార్యక్రమాలు మాంచి ఊపులో ఉన్నప్పుడే టీవీ ఛానళ్లు వృద్ధి చెందడం మొదలుపెట్టాయి. తెలుగు ఛానళ్లలో ఎప్పుడూ సినిమాలు, సినిమా కార్యక్రమాలు, సీరియళ్లు రావడంతో జనం మా కార్యక్రమాలకు రావడం తగ్గిపోయింది. జనం అలవాట్లలో మార్పులు వచ్చాయి. సభా కార్యక్రమాల్లో రెండుమూడుగంటలు కూర్చునే ఓపిక తగ్గిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రేక్షకులు రావడం లేదు. ఇరవై ముప్పై మందితో కార్యక్రమాలు జరిపిన సందర్భాలు ఉన్నాయి. ఇలాగే కొనసాగిద్దామంటే జనం రావడంలేదని ముఖ్య అతిథులు, అతిథులు, వక్తలు ఏవో కారణాలు చెప్పి ముఖం చాటేస్తున్నారు. నేను ఎప్పుడు పిలుస్తానా అని ఎదురు చూసిన వారు ఇప్పుడు నేను ఎక్కడ పిలుస్తానో అని తప్పించుకు తిరుగుతున్నారు. దీనికి తోడు పత్రికా విలేకరులు ''పేలవంగా జరిగిన సభ'' అని, ''వెలవెలబోయిన కార్యక్రమం'' అని శీర్షికలు పెట్టి వార్తలు రాయడంతో నా సాహితీ యాత్రకు సడెన్ బ్రేకు పడింది. ఇక నాకు గడ్డు రోజులు వచ్చాయనుకొని... పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మొండిగా ముందుకెళ్లడం వలన ప్రయోజనం లేదనుకొని అప్పటి నుంచి బుద్ధిగా ఆఫీసుకెళ్లి పనిచేసుకుంటున్నాను. అలా కొన్నిరోజులు గడిచిన తరువాతనుకుంటాను ఓ రోజు సదానందం మా ఆఫీసుకొచ్చాడు. సదానందం మా సాహితీ వారధి కార్యవర్గ సభ్యుడు. రాష్ట్రప్రభుత్వంలో ఒకానొక శాఖలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు.

నా దగ్గరకు వచ్చి ''గురు గారూ మీ కోసమే వచ్చానండీ'' అని అన్నాడు. అప్పుడప్పుడు సదానందం డిపార్ట్‌మెంట్ పనిమీద మా ఆఫీసుకు వస్తుంటాడు.

''కూర్చో... ఏమిటీ సంగతులు'' అని నవ్వుతూ అన్నాను. సాహితీ కార్యక్రమాలు ఆగిపోయిన తర్వాత మేం కలుసుకోవడం బాగా తగ్గిపోయింది. అందుకు కొంచెం బాధగానే ఉంది.

''అలా క్యాంటీన్‌కు వెళదాం గురుగారూ'' అని అన్నాడు. అలాగే అని ఇద్దరం క్యాంటీన్‌కు వెళ్లాం. టీ తాగుతుండగా ఉపోద్ఘాతం లేకుండానే ''గురుగారూ సాహితీ వారధిని'' నాకు అప్పగిస్తారా.... నేను కార్యక్రమాలు కొనసాగించాలనుకుంటున్నాను అని అన్నాడు.

''అయ్యో అదేం భాగ్యం... చక్కగా తీసేసుకో...కానీ జనం రావడం లేదు కదా ఎలా చేస్తావు'' అని అడిగాను.

''ఏదో పది ఇరవైమందితో కాలక్షేపంకోసం చేద్దామనుకుంటున్నాను''

''సరే కానీ అనవసరంగా పటాటోపాలకు పోయి చేతి చమురు వదిలించుకోకు'' అని సలహా ఇచ్చాను.

అప్పటికప్పుడు 'సాహితీ వారధి' సంస్థకు సంబంధించిన లెటర్ పాడ్‌ను ఇచ్చివేశాను. దాంతోపాటు ''సాహితీ వారధి''కి సదానందం అధ్యక్షునిగా ఎన్నికైనట్లు పత్రికా ప్రకటన కూడా రాసిచ్చాను. అవి తీసుకొని థాంక్స్ చెప్పి వెళ్లిపోయాడు సదానందం.

నేను కార్యక్రమాలు నిలిపివేసిన తరువాత మాఊళ్లోని ఇతర సాహితీ, సాంస్కృతిక సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఆహ్వానాలు అందినా నేను వెళ్లడం మానివేశాను.

సదానందం ''సాహితీ వారధి'' బరువు బాధ్యతలు చేపట్టిన ఓ నెల రోజుల తర్వాతనుకుంటాను నాకు ఓ కార్యక్రమానికి ఆహ్వానం పంపాడు. అయితే ఎప్పటిలాగే ఆ కార్యక్రమానికి కూడా నేను వెళ్లలేదు. తెల్లవారి మాత్రం ఆ కార్యక్రమానికి సంబంధించిన ఫోటో, మూడు కాలమ్‌ల వార్తను మూడు నాలుగు ప్రముఖ దినపత్రికల్లో చూశాను. ఆ తర్వాత కూడా సదానందం నిర్వహించే కార్యక్రమాల వార్తలను పత్రికల్లో చూస్తూనే ఉన్నాను.

ఏడాదిలోగా సదానందం మా పట్టణంలో ప్రముఖ వ్యక్తి అయి కూర్చున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదివరకు నేనున్న స్థానంలోకి వచ్చేశాడు.

నా కంటే మరో అడుగు ముందుకేసి ఇతరత్రా సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు వక్తగానో, అతిథిగానో కూడా వెళుతున్నాడు. మొదట్లో సదానందం కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సంతోషించాను. కానీ సదానందం ప్రతిష్ఠ రోజురోజుకీ పెరిగిపోతున్నందుకు నాలో ఈర్ష్య మొదలైంది.

సదానందం అంతకుముందు కవిత కానీ, కథగానీ రాసినట్లు నాకు గుర్తులేదు. కానీ ఈ ఏడాదిలోనే ఓ కవితా, ఓ కథా సంకలనాన్ని వెలువరించాడు. తన సంపాదకత్వంలో మరో రెండు కథా, కవితా సంకలనాలను తీసుకొచ్చాడు. వీటి గురించి వార్తలే కాకుండా చాలా పత్రికల్లో మంచి సమీక్షలు కూడా వచ్చాయి. అనేక సంకలనాలకు సదానందం ముందు మాటలు, కొన్నింటిపై విమర్శ కూడా రాసినట్లు విన్నాను.

సదానందం అంతకుముందు కవిత కానీ, కథగానీ రాసినట్లు నాకు గుర్తులేదు. కానీ ఈ ఏడాదిలోనే ఓ కవితా, ఓ కథా సంకలనాన్ని వెలువరించాడు. తన సంపాదకత్వంలో మరో రెండు కథా, కవితా సంకలనాలను తీసుకొచ్చాడు.


నేను సదానందం గురించి ఆలోచిస్తూ నాలో నేను రగిలిపోతున్న సమయంలో ఒక కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి నాకు ఆహ్వానం అందింది. ఆ కార్యక్రమానికి వేరే ఊరు నుంచి ఒక ప్రముఖ సాహితీవేత్త ముఖ్య అతిథిగా వస్తున్నాడు. ఆయనంటే నాకు వున్న అభిమానం కొద్దీ ఆ కార్యక్రమానికి వెళ్లాలని నిర్ణయించుకొన్నాను.

చాలా రోజుల తర్వాత ఒక సాహితీ కార్యక్రమానికి రావడం ఇదే మొదటిసారి. సాహితీ మిత్రులు కొందరు నా రాక పట్ల సంతోషం వెలిబుచ్చారు. పై ఊరి నుంచి రావలసిన సాహితీవేత్త అనివార్య కారణాల వల్ల రాలేకపోయారని అందువల్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించాడు సదానందం. అప్పటికీ సుమారు నలభై మంది ప్రేక్షకులు ఉండవచ్చు.

''ఏమిటీ ఇంత తక్కువమంది వచ్చారు'' అని పక్కనే ఉన్న సాహితీ మిత్రుడు నరసింహస్వామిని అడిగాను.

''ఈరోజు చాలా ఎక్కువ వచ్చినట్లు సార్...పై ఊరి నుంచి వచ్చే సాహితీ ప్రముఖుడికి పేరు ఉండడం వల్ల మీలాగే కొందరు వచ్చారు. సాధారణంగా పది, పదిహేను మంది కూడా ఉండం'' అని నవ్వాడు స్వామి. సదానందం సన్నిహితుడు స్వామి.

సభా కార్యక్రమానికి గంటలోగానే అయిందనిపించేశాడు. వేదిక పైనున్న వారికి కథాసాహిత్యం గురించి ఏమీ తెలిసినట్లు లేదు. వక్తలెవ్వరూ అయిదు నిమిషాలకు మించి మాట్లాడలేదు. అందులో ఎక్కువ భాగం ఒకరినొకరు పొగడుకోవడంలోనే సరిపోయింది. చాలా కాలం తర్వాత ఓ సాహితీ కార్యక్రమానికి నేను వచ్చినందుకు సదానందం చాలా సంతోషించాడు. కార్యక్రమం తర్వాత అతిథులతో పాటు నాకు కూడా ఓ స్టార్




హోటల్‌లో భోజనం పెట్టించాడు. సీనియర్ సాహితీవేత్తగా, నిర్వాహకుడిగా సదానందం నన్ను గౌరవిస్తున్నందుకు సంతోషించాను.

సదానందం వ్యవహారం పట్ల నాకు ఎన్నో సందేహాలున్నాయి. వీడ్కోలు తీసుకునేటప్పుడు నా మనసులో మాట గ్రహించినట్లుగా ''గురుగారూ... రేపు ఆదివారమే కదా... మీ ఇంటికి రావాలనుకుంటున్నాను... ఇంట్లో ఉంటారా.... ఉదయమే వస్తాను'' అని అన్నాడు.

''రేపు ఎక్కడికీ వెళ్లడం లేదు వచ్చేసెయ్'' అని ఆహ్వానించాను. నాకున్న సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని.

***

ఉదయం సదానందం వచ్చేసరికి రాత్రి జరిగిన కార్యక్రమానికి సంబంధించిన ఫోటోను, నాలుగు కాలమ్‌ల వార్తను పత్రికలో చూసి ఆశ్చర్యపోయాను. విలేకరులు ఎవరూ రాలేదు. పైగా వక్తలెవ్వరూ పెద్దగా ఏమీ మాట్లాడకున్నా కథల గురించి వారు మాట్లాడని విషయాలన్నీ వారు చెప్పినట్లు వార్త ఉంది. కార్యక్రమానికి వెళ్లిన నాకే ఆ వార్తను చదువుతుంటే సమావేశం బాగా జరిగినట్లు అనిపిస్తోంది. వార్త మాత్రమే చదివే పాఠకులు గొప్పగా ఫీలవకుండా ఎలా ఉంటారు?

ఇలా ఆలోచనలతో నా బుర్ర వేడెక్కుతున్న సమయంలో వచ్చాడు సదానందం. తను ఇప్పటి వరకూ ఆవిష్కరించిన పుస్తకాలను, ముందు మాట రాసిన కొన్ని పుస్తకాలను వస్తూనే నాకు బహూకరించాడు. ఫోటో ఆల్బమ్‌లు, తన కార్యక్రమాలపై వచ్చిన వార్తల కటింగ్‌లు అన్నీ చూపించాడు.

ఇక ఉండబట్టలేక ''అవునూ... నువ్వు ఇంతకు ముందెప్పుడూ కవితలు, కథలూ గట్రా రాసినట్లు నాకు జ్ఞాపకం లేదు... ఈ సంకలనాలెక్కడివయ్యా'' అని అడిగేశాను.

సదానందం చిద్విలాసంగా నవ్వి ''ఔత్సాహిక రచయితల సంకలనాలు ఆవిష్కరణ సభలు నిర్వహిస్తూంటాను కదా.... వాళ్లే రాసిస్తుంటారు... అఫ్‌కోర్స్ సబ్జెక్టు చెప్పి ఎలా రాయాలో నేనే చెబుతానుకోండి... మ్యూచువల్ కో ఆపరేషన్ అన్నమాట''

''మరి ముందుమాటలు, విమర్శ ఎలా మేనేజ్ చేస్తున్నావు''

''అవి కూడా మీలాంటి వారినే ఎవరినో పట్టుకొని రాయించుకుని పంపిస్తూంటాను. సాహితీ వారధి అధ్యక్షుడు రాశాడంటే వాళ్ల పుస్తకానికి గౌరవం వస్తుందని.... వాళ్లమాటను కాదనలేక'' నవ్వేశాడు సదానందం.

''నిన్న కార్యక్రమానికి విలేకరులు రాలేదు కదా... అంత పెద్ద వార్త ఎలా వచ్చింది?''

''నిన్నటి కార్యక్రమానికే కాదు గురుగారూ ఏ కార్యక్రమానికి విలేకరులు రారు. వస్తానన్నా నేనే సున్నితంగా రావద్దని చెప్పి.... నేనే ఫోటోలు వార్తను తెచ్చిస్తానని చెపుతాను. వాళ్లు వస్తే నెగిటివ్‌గా రాసే ప్రమాదముంది. మన ఔత్సాహిక రచయితలు, వక్తలు మాట్లాడని అంశాలను కూడా రాసేస్తారు. వాళ్లకీ మంచి పబ్లిసిటీ.. జనం రాకున్నా కార్యక్రమాలు నడుస్తున్నాయంటే కారణం ఇదే...

ఇది విన్నాక ఇంత చిన్న ఉపాయం కూడా నాకు రానందుకు గింజుకున్నాను.

''ఇంతకీ నిన్నటి కార్యక్రమానికి ముఖ్య అతిధి ఎందుకు రాలేదు... అంతటి అనివార్య కారణాలు ఏమిటి?''

''గురుగారూ నేనిప్పుడు చెప్పే విషయం మీరు మరెక్కడా అనకూడదు.... మీరు కాబట్టి ఈ విషయం చెబుతున్నాను. ఆయనను ముఖ్య అతిథిగా రావాలని అడిగిన మాట నిజమే... కానీ ఆయన వీలుకాదని అన్నారు. వీలుంటే రండి... లేకుంటే లేదని పేరు మాత్రం వేసుకుంటానని ఒప్పించాను.''

''రానప్పుడు ఆహ్వానంలో పేరు వేయడం ఎందుకు?''

''మన ఊరిలో నా ప్రతిష్టను పెంచుకోవడానికి. ఇంతటి ప్రముఖ వ్యక్తులతో నాకు పరిచయాలున్నాయని అందరికీ తెలియడం కోసం... ఈ మాత్రం గిమ్మిక్కులు చేయ్యకపోతే ఎలా సార్'' నవ్వుతూ అన్నాడు సదానందం.

నేను ఆలోచనలో పడిపోయాను.

అంతలో సదానందమే అన్నాడు. ''గురుగారూ మీరో నాకో సాయం చేయాలి. అందుకోసమే వచ్చాను. ఈ రోజు మీదగ్గరికీ''

ఏమిటి అన్నట్లు చూశాను.

ఈ నెలాఖరులో ఒక సంస్థ వారు నాకు ''సాహితీ బిందు'' అని బిరుదిచ్చి సన్మానించబోతున్నారు. పై నెలలో మరో సంస్థ వారు ''సాహితీ మిత్ర'' అనే బిరుదుతో సత్కారం చేయబోతున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు మీరు అధ్యక్షుడిగా వ్యవహరించాలని నా కోరిక... మీరు కాదనకూడదు''

నేను ఏదో ట్రాన్స్‌లో ఉన్న ట్లు ''అలాగేలే''అని అన్నాను.

చాలా సంతోషం గురు గారూ.. ఇక నేను వెళ్లొస్తాను... తేదీలు ఖరారు కాగానే తెలియజేస్తాను.

''వెళుదువుగాని... కూర్చో.... భవిష్యత్‌లో ఏం చేయాలని... ఇలాంటి గిమ్మిక్కుల వలన నీకు కానీ, సాహితీ కళారంగాలకు కానీ ఒనగూరేదేమిటీ?'' సదానందం ఆలోచన ఏమిటో తెలుసుకుందామని అడిగాను.

పిచ్చివాడా అని అర్థం వచ్చేలా ఒక చూపు చూసి ''గురుగారూ... మీ దగ్గర దాపరికం ఎందుకు? అవార్డులు, బిరుదులు, సన్మానాలే కదా సమాజసేవకు కొలబద్దలు... బయోడేటా రాసుకోవాలంటే ఇవన్నీ అవసరం. బయోడేటా ఎంత బాగుంటే అంత మంచిది. వారినే కదా ప్రభుత్వం గుర్తించి వివిధ పదవులకు, అకాడమీలకు నామినేట్ చేసేది. ఎంత ప్రతిభ ఉన్నా సరే సెల్ఫ్ ప్రమోషన్ లేకుంటే ఎవరూ లెక్కచేయరు,. మొదట్లో నన్ను చూసి నవ్వినవారే ఇప్పుడు నా ఎదుగుదలని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇలాగే కృషి చేస్తే రాజ్యసభ సభ్యత్వం వంటి అవకాశాలు కూడా రావచ్చు. ఇంకేమైనా జరగవచ్చు. లక్ష్యం ఉండడంలో తప్పులేదు కదా గురుగారూ... ఇప్పుడున్న స్థాయిలోనే ఇలాగే ఉన్నా నాకేమీ బాధలేదు. నాకు సాహితీ కళారంగాలపై నిజంగా ఉన్న ఇష్టంతోనే ఈ కార్యక్రమాలు చేపడుతున్నాను. సాహితీ కళారంగాలు నిరాదరణకు గురవుతున్నాయని, ఈ కార్యక్రమాలకు పరిస్థితులు అనుకూలంగా లేవని అనుకుంటూ నిరాశావాదంతో ఉండడం కన్నా మన ప్రయత్నం మనం చెయ్యడం మంచిది కదా... నవ్వేవారు ఎప్పుడూ ఉంటారు... నేవివేవీ పట్టించుకోను. అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణునిలా చెప్పుకుపోతున్నాడు సదానందం.

ఇప్పుడు మీరూ నమ్ముతారు కదా... మా సదానందం తెలివైనవాడని!!!